
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

మంగళవారం 23 ఏప్రిల్ 2024

శిక్షణకు గైర్హాజరైన 77 మందికి నోటీసులు


కలెక్టరేట్, ఏప్రిల్ 22: ఇటీవల నిర్వహించిన సాధారణ ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన 77 మంది పోలింగ్ అధికారులపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణకు హాజరుకాని వారంతా.. రెండు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆయా అధికారులకు నోటీసులు పంపించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.





జగనన్నా.. గ్రానైట్‌ను ముంచావ్ కదా!

- లోకల్ ఫ్యాక్టరీలకు ఇచ్చే కట్టర్‌సైజ్ బ్లాకులకు ఎత్తేసిన 25శాతం రాయితీ
- వైసీపీ హయాంలో 50శాతం కన్సరదైజేషన్ ఫీజు పెంపు
- విద్యుత్ సర్‌చార్జీల పేరిట అదనపు భారం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమంది ఉపాధికి దూరం




టెక్కలిలో గ్రానైట్ క్వారీ

(టెక్కలి)

వైసీపీ పాలనలో పరిశ్రమలు గడ్డు పరిస్థితి ఎదుర్కోగా.. ఉపాధి లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో అతి పెద్ద పరిశ్రమగా ఉన్న 'గ్రానైట్' కుదేలైంది. ఓ వైపు రాయితీలు ఎత్తేయడం, మరోవైపు వివిధ చార్జీల పేరిట అదనపు భారం మోపడంతో క్వారీల నిర్వహణ భారమవుతోందని యజమానులు గగ్గోలు పెడుతున్నారు. తమకు ఉపాధి కరువవుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల్లో పరిశ్రమలను ప్రోత్సహిస్తామని.. కార్మికులకు ఉపాధి కల్పిస్తామని హామీలు ఇచ్చిన వైఎస్ జగన్.. అధికారంలోకి వచ్చినతర్వాత వాటిని విస్మరించారని ఆరోపిస్తున్నారు. గ్రానైట్ పరిశ్రమల ద్వారా జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మందికి ఉపాధి లభించేది. కాగా.. గ్రానైట్ క్వారీల లీజుల మంజూరులో ఆక్షన్ విధానం పెట్టి అధికార పార్టీకి చెందిన తెరవెనుక పెద్దలు మొదలుకొని తమ అనుయాయులు వరకు అడ్డగోలుగా క్వారీల లీజులను మంజూరు చేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారికి ఏదో ఒకరకంగా కట్టడి చేయడం అధికార పార్టీ వంతైంది. ఎక్కడైనా కాస్త ఆదాయ వనరులు వచ్చే క్వారీలు ఉంటే చాలు. అధికార పార్టీ ముఖ్యనాయకులు వాటిని చేజిక్కుంచున్నారు. చివరికి కోర్టులో పెండింగ్‌లో ఉన్న క్వారీలను సైతం ఆక్షన్ వేసి.. స్కెచ్ గీయగా హైకోర్టు అడ్డుకునే పరిస్థితులు దాపురించాయి.

- టీడీపీ హయాంలో సీనరేజ్ చార్జీలు మాత్రమే ఉండగా, వాటికి వైసీపీ ప్రభుత్వం 50శాతం కన్సడరేషన్ ఫీజులు పెంచింది. టీడీపీ హయాంలో క్వారీ ఒక హెక్టారు లీజుకు రూ.1.30లక్షలు చెల్లించగా, ప్రస్తుతం దీనికి పదిరెట్లు పెంచేశారు. గతంలో మూడేళ్లకోసారి పర్యావరణ అనుమతులు తీసుకునేవారు. ఇప్పుడు ఏటా రెన్యువల్ చేసుకోవాలని చెబుతూ వందశాతం పెంచేశారు. సీఎఫ్‌వో, సీఎఫ్ఈ వంటి పొల్యూషన్ కు గతంలో పది వేలు ఫీజుండగా ఇప్పుడు లక్షకు చేరుకుంది. గతంలో విద్యుత్ రాయితీ ఉండగా.. ఇప్పుడు సర్‌చార్జీల పేరిట అదనపు భారాలు మోపారు.
- జిల్లాలో 160కు పైగా క్వారీలు, 130 వరకు గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లు ఉండేవి. ప్రస్తుతం 50కు పైగా క్వారీలు, 30కు పైగా గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లు ఎత్తేశారు. పక్కనే ఉన్న ఒడిశాలో రాయితీలు దొరుకుతుండడంతో పలు గ్రానైట్ పరిశ్రమలు ఒడిశా వైపు వెళ్లిపోయాయి. మరికొందరు తెలంగాణకు తరలిపోయారు. ప్రస్తుతం జిల్లాలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, సారవకోట, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస, మందస, మెళియాపుట్టి తదితర ప్రాంతాల్లో వందలోపు క్వారీలకు మాత్రమే పరిమితమయ్యాయి. విద్యుత్ రాయితీలు లేవు. సర్‌చార్జీలు పెంచేశారు. లోకల్ ఫ్యాక్టరీలకు సంబంధించి కట్టర్‌సైజ్ బ్లాకులకు ఉన్న 25శాతం రాయితీలను ఎత్తేశారు. దీంతో గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్ల పరిశ్రమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో వేలాది మందికి ఉపాధి దూరమైందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కోటబొమ్మాళి మండలంలో పలు గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లు అదనపు భారం మోయలేక పక్కనే ఉన్న ఒడిశా రాష్ట్రం గారబంద సమీపంలోకి తరలిపోయాయి.
- టెక్కలి సమీపంలో ఓ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్ యజమాని ఏకంగా యంత్ర పరికరాలను, ఆ స్థలాన్ని ఇతరులకు అమ్మేసి సొంతూరు రాజస్థాన్ వెళ్లిపోయాడు.
- టెక్కలి డివిజన్ పరిధిలో పలు గ్రానైట్‌క్వారీలు మూతపడుతుండడంతో మేఘవరం, లింగాలవలస, తిర్లంగి, సీతాపురం, నర్సింగపల్లి, టెక్కలిలో పలువురు స్కిల్డ్ లేబర్ ఉపాధి కోసం చెన్నై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వలస పోయారు.



నేడు జిల్లాకు చంద్రబాబు రాక

- పాతపట్నం, ఆమదాలవలసలో ప్రజాగళం సభలు
- రేపు మహిళామణులతో సమావేశం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం శ్రీకాకుళం జిల్లాకు రానున్నారు. పాతపట్నం, ఆమదాలవలసలో ప్రజాగళం సభలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం విజయనగరం జిల్లా గజపతినగరంలో మహిళామణులతో సమావేశం అనంతరం శ్రీకాకుళం జిల్లాకు హెలీకాప్టర్‌లో చేరుకుంటారు. మధ్యాహ్నం 2.45 గంటలకు పాతపట్నంలో నీలమణి దుర్గా మాత ఆలయం వద్ద శ్రీశ్రీనివాస నగర్‌లో హెలీప్యాడ్‌లో దిగుతారు. అక్కడ నుంచి 2.55గంటలకు రోడ్డు మార్గంలో బస్టాండ్‌కు చేరుకుంటారు. మూడు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజలతో పాతపట్నంలో బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం హెలీకాప్టర్‌లో బయలుదేరి ఆమదాలవలస మండలం తిమ్మాపురంలో సెయింట్ ఆన్స్ హైస్కూల్ మైదానంలో హెలీప్యాడ్‌లో సాయంత్రం 5.05 గంటలకు దిగుతారు. 5.15 గంటలకు ఆమదాలవలసలో కృష్ణాపురం జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడ రాత్రి 6 గంటల నుంచి 7.30 గంటల వరకు ప్రజాగళం సభలో ప్రసంగిస్తారు. అనంతరం రోడ్డు మార్గంలో బయలుదేరి శ్రీకాకుళంలో జిల్లా టీడీపీ కార్యాలయానికి రాత్రి 8.10 గంటలకు చేరుకుంటారు. ఇక్కడ బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లాలో మహిళామణులతో సమావేశమై మాట్లాడతారు. అనంతరం హెలీకాప్టర్‌లో బయలుదేరి విజయనగరం జిల్లాకు వెళ్తారు.

సీఎం వస్తున్నారు

- నేడు రాత్రి అక్కివలసలో జగన్ బస
- రేపు టెక్కలిలో 'సిద్ధం' సభ

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ మంగళవారం రాత్రి జిల్లాకు రానున్నారు. 'మేమంతా సిద్ధం' పేరుతో నిర్వహిస్తున్న బస్సుయాత్ర సభను బుధవారం టెక్కలిలో నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలో యాత్ర ముగించుకుని.. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం అక్కివలస చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. బుధవారం ఉదయం నుంచి బస్సుయాత్ర చేసుకుంటూ శ్రీకాకుళం మీదుగా టెక్కలి చేరుకుంటారు. టెక్కలిలో బస్సుయాత్రను ముగించి తిరుగు పయనమవుతారు. అయితే ఈ యాత్ర.. పార్వతీపురం మన్యం జిల్లాకు కలపలేదు. ఆ జిల్లా వెళ్లకుండానే.. సిక్కోలులో యాత్ర ముగిస్తారా.. మన్యం జిల్లా నుంచి వచ్చి.. టెక్కలిలో యాత్రను ముగిస్తారా? అన్నది వైసీపీ నాయకుల్లో సందేహం నెలకొంది.

- కాగా.. జిల్లాలో రెండు రోజులపాటు మాజీ సీఎం, ప్రతిపక్ష నేత చంద్రబాబుతోపాటు సీఎం జగన్ కూడా పర్యటించనుండడంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



టెక్కలిలో నామినేషన్ వేస్తున్న అచ్చెన్నాయుడు



శ్రీకాకుళంలో గొండు శంకర్ నామినేషన్

పెరిగిన నామినేషన్ల జోరు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల జోరు పెరిగింది. సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి సీదిరి అప్పలరాజుతోపాటు పలువురు నామినేషన్లు వేశా రు.

- శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి.. నాయుడిగారి రాజశేఖర్(బీఎస్పీ), పేడాడ పరమేశ్వరరావు(కాంగ్రెస్), పేడాడ చంద్రశేఖర అజాద్(కాంగ్రెస్), ఎద్దు లక్ష్మీనారాయణ (ఇండిపెండెంట్) నామినేషన్లు వేశారు. బీఎస్పీ అభ్యర్థి రాజశేఖర్.. నామినేషన్ కోసం చెల్లించాల్సిన ధరావత్తు రూ.10వేలు.. చిల్లర నాణేలుగా ఇచ్చారు. అధికారులు వాటిని లెక్కించేసరికి చాలా సమయం పట్టింది.
- అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి.. శ్రీకాకుళంలో గొండు శంకర్(టీడీపీ), గొండు స్వాతి(టీడీపీ), అంబటి కృష్ణారావు (కాంగ్రెస్) నామినేషన్ వేశారు. ఇచ్ఛాపురంలో మురపాల లక్ష్మి(ఇండిపెండెంట్), పాతపట్నంలో కొయ్యాన గోవిందరావు(ఇండిపెండెంట్), రెడ్డి శాంతి(వైసీపీ) నామినేషన్లు వేశారు. ఆమదాలవలసలో సనపల అన్నాజీరావు (కాంగ్రెస్), తమ్మినేని సీతారాం (వైసీపీ), తమ్మినేని చిరంజీవి(వైసీపీ), లాస సోమేశ్వర రావు(బీఎస్పీ), సనపల సురేష్‌కుమార్ (ఇండి పెండెంట్), గురుగు రేవతి(జేసీవీఐవి) నామి నేషన్లు వేశారు. ఎచ్చెర్లలో కోనేటి నీలాచలం(పిరమిడ్), బర్రి కొర్లయ్య (జై భారత్ నేషనల్ పార్టీ), కరిమజ్జి మల్లేశ్వరరావు(కాంగ్రెస్), కరిమజ్జి రమేష్ (కాంగ్రెస్) నామినేషన్లు వేశారు. నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్(వైసీపీ), కాయ కామేశ్వరి(ఎన్‌సీపీ), మంత్రి నరసింహ మూర్తి (కాంగ్రెస్) నామినేషన్లు వేశారు.

టెక్కలిలో అచ్చెన్న..

టెక్కలి, ఏప్రిల్ 22: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. సోమవారం టెక్కలిలో టీడీపీ అభ్యర్థిగా అచ్చెన్నాయుడు నామినేషన్ వేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి నూరుల్‌కమర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ సందర్భంగా టెక్కలి, నంది గాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, అభిమానులు వేలాదిమంది ర్యాలీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా తనపై 24 కేసులున్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో అచ్చెన్నాయుడు వెల్ల డించారు. అందులో 11 కేసులు హౌస్‌అరెస్టులేనని, మిగిలినవి వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నడుస్తున్నాయని పేర్కొన్నారు.

అస్తులు.. అప్పులివీ..

అచ్చెన్న 2022-23 సంవత్సరానికి రూ.24,65,177, ఆయన భార్య విజయమాధవి రూ.59,89,740 ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించారు. అచ్చెన్నాయుడు వద్ద చేతి నగదు రూ.2.50 లక్షలు, విజయమాధవి వద్ద రూ.5లక్షలు, కుమారుడు కృష్ణమోహన్‌నాయుడు వద్ద రూ.2లక్షలు ఉన్నట్లు తెలిపారు. ఇన్నోవా వాహనం, డైమండ్స్‌తోపాటు బంగారు ఆభరణాల వివరాలు వెల్లడించారు. తన పేరున రూ.16.14కోట్ల విలువైన భూములు, భార్య పేరున రూ.192 కోట్ల విలువైన భూములు వివిధ ప్రాంతాల్లో ఉన్నాయని తెలిపారు. కృష్ణమోహన్ నాయుడు పేరున 4.87 ఎకరాలు ఉందన్నారు. నిమ్మాడ, చిన్నవాల్తేరులో ఒక్కో ఇల్లు ఉందని తెలిపారు. భార్య విజయమాధవి పేరిట రూ.3.36 కోట్లు అప్పు ఉన్నట్టు అఫిడవిట్‌లో అచ్చెన్న పేర్కొన్నారు.

మంత్రి సీదిరిపై 3 కేసులు..

పలాస, ఏప్రిల్ 22: మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు.. పలాస వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. సోమవారం పలాసలో ఎన్నికల అధికారి భరత్‌నాయక్‌కు మంత్రి రెండు సెట్లు, ఆయన భార్య శ్రీదేవి ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు. తనపై మూడు కేసులు ఉన్నట్టు మంత్రి అప్పలరాజు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2018లో డోకి హరీష్ మృతికి సంబంధించి చేసిన ఆందోళనపై 143, 283, 341, 149 ఐపీసీ సెక్షన్లు, 2020లో కొవిడ్ సమయంలో మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌లో 188, 271 సెక్షన్లు, 2020లో ఆర్‌పీఎఫ్ పలాసలో 145(బి), 147 రైల్వే యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయని తెలిపారు. తన పేరు మీద రూ.14,98,000. భార్య శ్రీదేవి పేరుమీద రూ.4,97,700 నగదు ఉన్నట్లు వెల్లడించారు.

'పది'లో సత్తా చాటారు

- జిల్లాలో 93.35 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో సిక్కోలుకు ద్వితీయ స్థానం
- ఫలితాల్లో బాలికలే ముందంజ



భాగ్యశ్రీ (596)



మణికంఠ (594)



మధుశ్రీ (593)



సోనియా(592)

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

పదోతరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. 93.35 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో జిల్లాకు ద్వితీయ స్థానం లభించింది. ఈ ఏడాది జిల్లాలో 28,745 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 26,833 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు కన్నా.. బాలికలే ముందంజలో నిలిచారు. 14,712 మంది బాలురకు గానూ 13,489 మంది(91.69 శాతం) పాసయ్యారు. 14,033 మంది బాలికలకుగానూ 13,344 మంది (95.09 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఈసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా మంచి ప్రతిభ చూపారు. చాలామంది విద్యార్థులు 500కిపైగా మార్కులు సాధించారు. మందస జడ్పీ హైస్కూల్ విద్యార్థిని భాగ్యశ్రీ పండిట్‌కు 596 మార్కులు, ఎచ్చెర్ల మండలం అల్లినగరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ముని మణికంఠ 594 మార్కులు సాధించారు. సారవకోట మండలం బుడితి ఉన్నతపాఠశాలకు చెందిన ఎం.మధుశ్రీ 593 మార్కులు సాధించింది. మెళియాపుటి మండలం కొసమాళ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మామిడి సోనియా 592 సాధించింది. ఇలాచాలా ప్రభుత్వ పాఠశాలలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణతయ్యారు. జోన్-1లో మొదటి స్థానం పార్వతీపురం మన్యం జిల్లాకు లభించగా.. రెండో స్థానం సిక్కోలుకు దక్కడంతో విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు విజయభాస్కర్.. జిల్లా విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను అభినందించారు.

- **ఫస్ట్ క్లాస్‌లో మనమే టాప్...**

ఉత్తీర్ణత శాతంలో రాష్ట్రంలో జిల్లాకు రెండో స్థానం లభించింది. కానీ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఫస్ట్, సెకెండ్, థర్డ్‌క్లాస్‌ల వారీగా ఉత్తీర్ణులైన వారిని విభజిస్తే.. రాష్ట్రంలో సిక్కోలు మొదటి స్థానంలో నిలిచింది. ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులైనవారు 23,157 మంది, సెకెండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులైనవారు 2,774మంది, థర్డ్ క్లాస్‌లో పాసైన వారు 902 మంది ఉన్నారు.



ఆమదాలవలసలో మద్యం షాపు వద్ద క్యూ కట్టిన వైసీపీ కార్యకర్తలు

మందు, విందు ఉంటే అంతా సిద్ధం

ఆమదాలవలస, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికల వేళ.. ఏ కార్యక్రమం నిర్వహించినా మందు, విందు ఉంటే అంతా సిద్ధంగా మారింది. సోమవారం ఆమదాలవలస నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాం నామినేషన్ కార్యక్రమానికి హాజరైన వైసీపీ కార్యకర్తలు, పలువురు వ్యక్తులు విచ్చలవిడిగా మద్యం సీసాలతో చిందులు వేశారు. మునిసిపాలిటీతో పాటు నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన ప్రజలకు ఆయా గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు రవాణాతోపాటు భోజనం, మందు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆమదాలవలసలో ఎక్కడ చూసినా మందు, విందు దృశ్యాలే కనిపించాయి.



మాట్లాడుతున్న డీఐజీ విశాల్ గున్నీ

మడపాం చెక్‌పోస్టులో డీఐజీ తనిఖీ

నరసన్నపేట, ఏప్రిల్ 22: మడపాం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం రవాణా, నగదుతో పాటు ఇతర వస్తువులను పరిశీలించాలన్నారు. బుధవారం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బస్సుయాత్ర భద్రత విషయాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, డీఎస్పీలు బాలచంద్రారెడ్డి, శ్రుతి, సీఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

టీడీపీలో వలంటీరు చేరిక

టెక్కలి, ఏప్రిల్ 22: టెక్కలి మండలం తేలినీలాపురం పంచాయతీ వేములాడ విశ్వనాథపురం గ్రామానికి చెందిన వలంటీర్ బి.సింహాచలంతో పాటు పలువురు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో సోమవారం రాత్రి టీడీపీలో చేరారు. అలాగే బూరగాం పంచాయతీ నుంచి గేదెల అఖిలేష్‌రెడ్డి, పి.గణేష్‌లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తామంతా టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.



టీడీపీలో చేరిన వలంటీరు, తదితరులు


బెండాళం అశోక్ | పిరియా విజయ | ఎంవీ కృష్ణారావు | అచ్యుతరామయ్యరెడ్డి | లండ కారయ్య రెడ్డి | ఉప్పాడ రంగబాబు | ఆశి నీలాద్రి రెడ్డి | నరేష్‌కుమార్ అగ్రవాలా

వార్ వన్ సైడేనా?

- టీడీపీ కంచుకోటగా ఇచ్ఛాపురం
- హ్యాట్రిక్‌పై కన్నేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే అశోక్
- సంఘటితంగా దూసుకుపోతున్న కేడర్
- వైసీపీ నుంచి బరిలో జడ్పీ చైర్‌పర్సన్ విజయ
- అధికార పార్టీలో గ్రూపు తగాదాలు
- సాయిరాజ్ ఏక్షపక్ష విధానాలపై కేడర్‌లో అసంతృప్తి
- నియోజకవర్గానికి ఏడు దశాబ్దాల చరిత్ర

ఇచ్ఛాపురంలో ఈసారి వార్ వన్ సైడేనా?. టీడీపీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఓటర్లు మరోసారి తెలుగుదేశం అభ్యర్థికే పట్టంకట్టబోతున్నారా?. అధికార పార్టీని నమ్మడం లేదా?. అంటే దీనికి అవుననే సమాధానం వినిపిస్తోంది. టీడీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ మూడోసారి బరిలోకి దిగుతుండగా, వైసీపీ నుంచి మహిళా నేత, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పోటీలో ఉన్నారు. పార్టీ కేడర్‌ను కలుపుకుని ఎమ్మెల్యే అశోక్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసీపీని మాత్రం గ్రూపు తగాదాలు కలవరపెడుతున్నాయి. పార్టీ అభ్యర్థి విజయ భర్త సాయిరాజ్ ఒంటెత్తు పోకడలతో కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఏడు దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోట ములను శాసించేది మాత్రం మహిళా ఓటర్లే.

(ఇచ్ఛాపురం)





దాదాపు ఏడు దశాబ్దాల చరిత్ర ఉన్న ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తం 15సార్లు ఎన్నికలు జరిగాయి. టీడీపీ ఎనిమిది సార్లు, కాంగ్రెస్ మూడుసార్లు, జనతాపార్టీ ఒకసారి, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి, కృషికార్‌లోక్ రెండుసార్లు విజయం సాధించాయి. 1982 లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత ఆ పార్టీకి కంచుకోటగా మారింది. 2019 వరకు తొమ్మిది సార్లు ఎన్నికలు జరగ్గా ఎనిమిది పర్యాయాలు టీడీపీ గెలుపొంది రికార్డు సాధించింది. ఒక్కసారి మాత్రమే కాంగ్రెస్ 2014లో విజయం సాధించింది.

తొలిసారి టీడీపీ గెలుపు..

ఉమ్మడి మంద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైన తరువాత ఇచ్ఛాపురం నియోజకవర్గం ఏర్పడింది. ఈ నియోజవర్గంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలు ఉన్నాయి. ఇక్కడ రెడ్డి, యాదవ, కాళింగ సామాజిక వర్గాలు ఎక్కువగా ఉన్నారు. 1982 మార్చిలో తెలుగు దేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించారు. 1983 జనవరిలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లాబాల సుందరరావుపై టీడీపీ అభ్యర్థి ఎంవీ కృష్ణారావు గెలుపొంది మొదటి ఎమ్మెల్యేగా రికార్డు ఎక్కారు. 1985లో కాంగ్రెస్ అభ్యర్థి లాబాల సుందరరావుపై, 1989లో కాంగ్రెస్ అభ్యర్థి బుద్దాల త్రినాథరెడ్డిపై టీడీపీ అభ్యర్థి ఎంవీ కృష్ణారావు గెలుపొందారు. 1994లో త్రిముఖ పోటీ నెలకొంది. టీడీపీ నుంచి దక్కత అచ్యుతరామిరెడ్డి, కాంగ్రెస్ నుంచి బుద్దాల త్రినాథరెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా బెందాళం ప్రకాష్ బరిలో దిగారు. ఇందులో టీడీపీ అభ్యర్థి అచ్యుతరామిరెడ్డి విజయం సాధించారు. 1999లో కాంగ్రెస్ అభ్యర్థి నరేష్ కుమార్ అగ్రవాలాపై టీడీపీ అభ్యర్థి ఎంవీ కృష్ణారావు గెలుపొందారు. 2004లో పునర్విభజన జరగడంతో సోంపేట మండలాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కలిపారు. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి దక్కత ఏకాంబరిపై కాంగ్రెస్ అభ్యర్థి నరేష్‌కుమార్ అగ్రవాలా గెలుపొందారు. 2009లో త్రిముఖపోటీ నెలకొంది. కాంగ్రెస్ తరపున నర్తు రామారావు, ప్రజారాజ్యం పార్టీ నుంచి నర్తు శేషగిరి, టీడీపీ తరపున పిరియా సాయిరాజ్ బరిలో దిగారు. వీరిలో సాయిరాజ్‌కు విజయం వరించింది. 2014లో కూడా మళ్లీ త్రిముఖ పోటీయే. వైసీపీ నుంచి నర్తు రామారావు, సమైక్యాంధ్ర తరపున మురపాల కాశీప్రసాద్, టీడీపీ నుంచి బెందాళం అశోక్ పోటీ పడగా అశోక్ గెలుపొందారు. 2019లో మరోసారి త్రిముఖ పోటీ ఏర్పడింది. వైసీపీ అభ్యర్థిగా పిరియా సాయిరాజ్, జనసేన పార్టీ అభ్యర్థిగా దాసరి రాజు, టీడీపీ అభ్యర్థిగా బెందాళం అశోక్ పోటీ పడగా అశోక్ గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యే బెందాళం అశోక్, వైసీపీ నుంచి జడ్పీ చైర్‌పర్సన్, పిరియా సాయిరాజ్ సతీమణి పిరియా విజయ తలపడుతున్నారు. అయితే, హ్యాట్రిక్ విజయం సాధిస్తానని సిట్టింగ్ ఎమ్మెల్యే అశోక్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీ బలంగా ఉండడంతో గెలుపు లాంఛనమేనని కేడర్ భావిస్తోంది. సంఘటితంగా టీడీపీ పోరాడుతోంది. అధికార పార్టీలో కొంతవరకు గ్రూపు తగాదాలు ఉన్నాయి. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఏకపక్ష విధానాలపై క్యాడర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. పార్టీ కోసం పదేళ్లుగా పని చేస్తున్న వారు సైతం ఒక్కొక్కరుగా సైలెంట్ అయిపోతున్నారు. కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు, పలు గ్రామాల సర్పంచ్‌లు పార్టీ ప్రచారానికి దూరంగా ఉండడం కేడర్‌లో ఆందోళన కలిగిస్తోంది. నియోజకవర్గంలో కాంగ్రెస్, టీడీపీ, స్వతంత్ర, జనతాపార్టీలు గెలుపొందినప్పటికి వైసీపీ మాత్రం ఇంతవరకు గెలవలేదు.

నియోజకవర్గ ఓటర్లు..

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్స్	మొత్తం
ఇచ్ఛాపురం	37,808	40,688	10	78,506
కవిటి	30,766	32,397	2	63,165
కంచిలి	27,306	28,602	1	55,909
సోంపేట	34,301	35,311	4	69,616
మొత్తం	1,30,181	1,36,998	17	2,67,196

గత పదిహేను ఎన్నికల విజేతలు..

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1953	ఆశి నీలాద్రిరెడ్డి	కృషికార్‌లోక్	హరహర పట్నాయిక్	ఇండిపెండెంట్	-
1955	ఉప్పాడ రంగబాబు	కృషికార్‌లోక్	హరహర పట్నాయిక్	ఇండిపెండెంట్	7,157
1962	కీర్తి చంద్రదేవ్	కాంగ్రెస్	దక్కత పితాంబర్‌రెడ్డి	స్వతంత్ర	9150
1967	లండ కారయ్యరెడ్డి	స్వతంత్ర	కీర్తిచంద్రదేవ్	కాంగ్రెస్	6433
1972	ఉప్పాడ రంగబాబురెడ్డి	కాంగ్రెస్	బెందాళం వెంకటేశ్వరశర్మ	స్వతంత్ర	2453
1978	బెందాళం వెంకట శర్మ	జనతా	కాళ్ల బలరాంస్వామి	ఇందిరా కాంగ్రెస్	14446
1983	ఎంవీ కృష్ణారావు	టీడీపీ	లాబాల సుందరరావు	కాంగ్రెస్	9106
1985	ఎంవీ కృష్ణారావు	టీడీపీ	లాబాల సుందరరావు	కాంగ్రెస్	35368
1989	ఎంవీ కృష్ణారావు	టీడీపీ	బుద్దాల త్రినాథరెడ్డి	కాంగ్రెస్	16499
1994	దక్కత అచ్యుతరామయ్యరెడ్డి	టీడీపీ	బుద్దాల త్రినాథరెడ్డి	కాంగ్రెస్	13484
1999	ఎంవీ కృష్ణారావు	టీడీపీ	నరేష్‌కుమార్ అగ్రవాలా	కాంగ్రెస్	4343
2004	నరేష్‌కుమార్ అగ్రవాలా	కాంగ్రెస్	దక్కత ఏకాంబరి	టీడీపీ	7745
2009	పిరియా సాయిరాజ్	టీడీపీ	నర్తు రామారావు	కాంగ్రెస్	2275
2014	బెందాళం అశోక్	టీడీపీ	నర్తు రామారావు	వైసీపీ	25278
2019	బెందాళం అశోక్	టీడీపీ	పిరియా సాయిరాజ్	వైసీపీ	7145





అభ్యర్థులు 16 మందికి మించితే..

గార: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల స్థానంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు(ఈవీఎం) వినియోగిస్తున్నారు. అయితే నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎం వినియోగించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఒక ఈవీఎంలో 16 మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలుంటుంది. అంత కన్నా ఎక్కువ మంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. ఉదాహరణకు 18 మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదటి ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరు వివరాలు ఉంచుతారు. దీంతోపాటు ఏ పోలింగ్ బూత్ లోనైనా, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత మధ్యలో ఈవీఎం మొరాయిస్తే అప్పటి వరకు నమోదైన వివరాలను సీల్‌చేసి, రెండో ఈవీఎంను వినియోగిస్తారు.

ముఖ్యమంత్రినే నిలదీశా!

జ్ఞాపకాలు

(పలాస)



'నా భర్త నిచ్చెర్ల రాములు నాటి బ్రాహ్మణ తర్లా, టెక్కలి అసెంబ్లీ నియోజక వర్గాలకు 1955, 1967లో కృషికర్ లోక్‌పార్టీ, స్వతంత్ర అభ్యర్థిగా రెండుమార్లు పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఒకసారి నేను పని ఉండి అసెంబ్లీకి వెళ్లాను. అక్కడ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఎదురు పడ్డారు. మీరు ఎవరు..ఎందుకు లోపలికి వస్తున్నారు. ఇది శాసనాలు చేసే శాసనసభ అని తెలియదా అని ప్రశ్నించారు. దీంతో నేను ఎమ్మెల్యే భార్యనని, నాకు ఇక్కడకు వచ్చే హక్కు ఉందని, వద్దన డానికి మీరెవరు అని నిలదీశాను'. అని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు మాజీ ఎమ్మెల్యే రాములు సతీమణి వెంకటేశ్వరమ్మ(90). ఆమె ఇంకా ఏమన్నారంటే.. ఎన్నికల్లో తన భర్త సొంత డబ్బులతో గెలిచేవారని, ప్రజలు కూడా డబ్బులు ఆశించకుండా మంచితనానికే ఓట్లు వేసే వారని చెప్పారు. ప్రజాప్రతినిధులంటే ఎంతో గౌరవం, మర్యాదలు ఉండేవని తెలిపారు. ఒకసారి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి వద్దకు వెళ్లగా తన భర్తను మర్యాదగా చూడడంతో పాటు గౌరవం ఇచ్చేవారని చెప్పారు. ప్రస్తుతం రాజకీయాలు చూస్తుంటే బాధేస్తుందన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే, ఎంపీలు కూడా ముఖ్యమంత్రి వద్దకు నేరుగా వెళ్లి కలిసే పరిస్థితి లేదన్నారు. రెండు, మూడు రోజులు లేనిదే కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వరని, అటువంటప్పుడు ప్రజాసమస్యలు ఆయన వద్దకు ఏ విధంగా కిందిస్థాయి నాయకులు తీసుకువెళ్లగలరని, ఎప్పుడు ఆ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. తనకు వృద్ధాప్యం వచ్చినా నేరుగా పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయడం అలవాటని, ఈఎన్నికల్లో కూడా ఓటు వేస్తానని చెప్పారు.

-వెంకటేశ్వరమ్మ, దివంగత ఎమ్మెల్యే నిచ్చెర్ల రాములు సతీమణి

144 సెక్షన్ ఎందుకు విధిస్తారు



హిరమండలం: ఎన్నికలు, అల్లర్లు జరిగేటప్పుడు, పరీక్షల నిర్వహణ సమయంలో ఎక్కువగా 144 సెక్షన్ విధిస్తుంటారు. అసలు 144 సెక్షన్ అంటే ఏమిటి, ఎందుకు, ఎప్పుడు విధిస్తారో తెలుసుకుందాం. సీఆర్‌పీసీ 144 సెక్షన్ కింద ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లకు విస్తృత అధికారాలు కల్పించారు. ప్రధానంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిన సమయలో పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఈ సెక్షన్ అమలు చేస్తారు. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సమయంలో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద దీనిని విధిస్తారు. ఈ సెక్షన్ అమలు లోకి వస్తే నలుగురు ఐదుగురు వ్యక్తులకు మించి గుమిగూడ కూడదు. కలిసి తిరగడంపై కూడా నిషేధాజ్ఞలు విధిస్తారు. ఎన్నికల సమయంలో నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేవరకు ఈ సెక్షన్ అమలులో ఉంటుంది. ఆ సమయంలో ప్రదర్శనలు, ఊరేగింపులు,ర్యాలీలు చేయరాదు. ప్రధానంగా రెండు పార్టీలు, గ్రూపుల మధ్య తగాదాలు తలెత్తినప్పుడు కూడా విధిస్తారు. రెండు నెలల వరకు కలెక్టర్, ప్రభుత్వం నియమించిన మేజిస్ట్రేట్ పోలీసు మాన్యువల్ ప్రకారం ఎస్పీలు ఈ సెక్షన్‌ను అమలు చేస్తారు.

హద్దుమీరితే వేటే..

- ప్రభుత్వోద్యోగులూ.. తస్మాత్ జాగ్రత్త
- ఇప్పటి వరకు జిల్లాలో 8 మంది సస్పెన్షన్



(మెళియాపుట్టి)

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ప్రజా ప్రతినిధులతో సన్నిహితంగా ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగులపై ఈసీ నిఘా పెంచింది. ఏ రాజకీయ పార్టీ నాయకులకైనా కొమ్ముకాసేలా వ్యవహరిస్తే వేటువేసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని రంగంలోకి దించింది. ఉద్యోగుల రోజువారీ కార్యకలాపాలే కాకుండా వారు వినియోగించే సామాజిక మాధ్యమాల ఖాతాలు, పోస్టులపై కన్నేసింది. దీంతోపాటు రాజకీయపార్టీ నాయకుల ఫిర్యాదు ఆధారంగా అధికారులు దర్యాప్తుచేసి వారిపై వేటు వేస్తున్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఎనిమిది మంది ఉద్యోగులు సస్పెండ్‌కు గురయ్యారు. ఎన్నికల్లో వైసీపీ గెలుపొందితే తమకు మంచి పోస్టింగ్‌లు వస్తాయని కొందరు ఉద్యోగులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఈసీ కొరడా..

ప్రస్తుత సాధారణ ఎన్నికల సమయంలో రిసార్ట్స్, గెస్ట్‌హౌస్‌లు, ఫంక్షన్ హాళ్లలో ప్రధాన రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు విందు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ సంఘం నాయకుల ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కారానికి సమావేశాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. హద్దు మీరిన ఉద్యోగులపై ఈసీ కొరడా ఝుళిపిస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమయంలో ఉద్యోగులు ఎవరైనా సస్పెండ్‌కు గురైతే వారు తిరిగి విధుల్లోకి చేరడం కష్టమేనని ఈసీ వర్గాలు చెబుతున్నాయి. తీవ్ర అభియోగాలు ఉండి సస్పెండ్‌కు గురైతే పోస్టింగ్ రావడం అంత తేలికకాదని పేర్కొంటున్నాయి. సాధారణంగా సస్పెండ్ అయితే ఆరు నెలల్లో తిరిగి పోస్టింగ్ పొందవచ్చు.

చిన్న ఆధారం ఉన్నా..

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఏ రాజకీయ పార్టీకైనా అనుకూలంగా వ్యవహరించినట్లు ఏ చిన్న ఆధారం దొరికినా ఎన్నికల సంఘం వేటు వేస్తుంది. ఉద్యోగులు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్)లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా పోస్టింగ్, సేరింగ్ చేసినా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో గత నెల 18న ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. అయితే కొంత మంది ఉపాధ్యాయులతో పాటు ఫీల్‌అసిస్టెంట్లు సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో పాటు వాట్సాప్‌ల్లో పోస్టింగ్ పెట్టినట్లు నిర్ధారణ కావడంతో పలువురిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. గత నెల 21న మందస మండలం భోగాపురం ఫీల్డ్ అసిస్టెంట్ అగ్గల దేవేంద్రుడు, అదే నెల 27న మందస మండలం తల్లాగురంటి ఫీల్డ్ అసిస్టెంట్ నల్ల లోకనాథం చౌదరిపై చర్యలు తీసుకున్నారు. గత నెల 30న పలాస మండలం పెదంచల జడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న బెహరా మాధవరావు, అదేరోజు సారవకోట మండలం మూగుపురం పాఠశాలలో పనిచేస్తున్న చౌదరి లక్ష్మీనారాయణ వాట్సాప్‌లో అధికార పార్టీకి అనుకూలంగా పోస్టింగ్ పెట్టడంతో సస్పెండ్‌కు గురయ్యారు. ఈ నెల 2న శ్రీకాకుళం తుమ్మావీధి పాఠశాలలో పనిచేస్తున్న పప్పుల సత్యనారాయణపై చర్యలు తీసుకున్నారు. 6న కాశీబుగ్గ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు తమ్మినేని మన్మథరావుపై వేటు పడింది. వైసీపీ నాయకులకు సహకరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగిని సైతం కలెక్టర్ సస్పెండ్ చేశారు.

మహిళల ఆశీర్వాదమే కీలకం

- ఏడు నియోజకవర్గాల్లోనూ వారే అధికం
- పురుషుల కంటే 17,466 మంది ఎక్కువ



(కలెక్టరేట్)

జిల్లాలో ఏడు నియోజకవర్గాలు, ఒక లోక్‌సభ సెగ్మెంట్‌లో అభ్యర్థుల గెలుపునకు మహిళా ఓటర్లే కీలకంగా మారారు. గత రెండు దశాబ్దాలుగా వీరి తీర్పే అభ్యర్థుల విజయావకాశాలను నిర్ణయిస్తోంది. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉండడం... గంపగుత్తగా ఓట్లు వేయడం వల్ల వీరి ప్రభావం అధికంగా ఉంది. 2024 ఎన్నికల్లో కూడా మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. జిల్లాలో పురుషులు, మహిళల ఓటర్లు మొత్తం 16,26,908 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 8,04,721 మంది, మహిళా ఓటర్లు 8,22,187 మంది ఉన్నారు. పురుషుల కంటే 17,466 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండడం విశేషం. జిల్లాలోని మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను ఎచ్చెర్ల నియోజకవర్గం విజయనగరం లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో ఉంది. మిగిలిన ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, ఆముదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఇందులో అత్యధికంగా శ్రీకాకుళం నియోజకవర్గంలో 1,37,488 మంది మహిళా ఓటర్లు ఉండగా, 1,37,254 మంది మహిళా ఓటర్లతో ఇచ్ఛాపురం నియోజకవర్గం రెండో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయపార్టీలు ఎన్నికల్లో గెలుపు కోసం మహిళా ఓటర్ల కోసం మేనిఫెస్టోలో ప్రత్యేక పథకాలు మహిళలకు ప్రకటిస్తున్నాయి. కొత్త కొత్త పథకాలతో మహిళా ఓటర్లను ఆకర్షించే పనిలో తలమునకలయ్యాయి. ఏదేమైనా జిల్లాలో రానున్న ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది మహిళా ఓటర్లేనని విశ్లేషకులు చెబుతున్నారు. మరి వీరంతా ఎవరిని ఆశీర్వదిస్తారో చూడాలి.

నియోజకవర్గం	మహిళా ఓటర్లు	పురుష ఓటర్లు
ఇచ్ఛాపురం	1,37,254	1,30,544
పలాస	1,11,709	1,06,877
టెక్కలి	1,18,129	1,17,511
పాతపట్నం	1,12,696	1,12,095
శ్రీకాకుళం	1,37,488	1,34,866
ఆముదాలవలస	97,477	95,987
నరసన్నపేట	1,07,434	1,06,841
మొత్తం ఓటర్లు	8,22,187	8,04,721

జన కేతనం
ఆంధ్రజ్యోతి మంగళవారం 23 ఏప్రిల్ 2024

రంగు పూశారు.. మాయ చేశారు..

- టిడ్కో గృహాల్లో కానరాని సౌకర్యాలు
- ఐదేళ్లుగా శ్రద్ధచూపని వైసీపీ ప్రభుత్వం
- లబ్ధిదారుల ఆందోళన
- ఇదీ ఆమదాలవలసలో పేదల ఇళ్ల పరిస్థితి


నిలిచిన టిడ్కో గృహాల పనులు

ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు జగ్గుశాస్త్రులపేట వద్ద టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను పేదలకు అప్పగించకుండా వైసీపీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. గత ప్రభుత్వ పాలనలోనే 80శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్నికలకు కేవలం మూడు నెలల ముందు హడావుడిగా కొన్ని టిడ్కో గృహాలకు రంగులు వేసి స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించారు. ఎంతో ఆనందంగా అక్కడకు వెళ్లిన లబ్ధిదారులు అక్కడి పరిస్థితిని చూసి ఖంగుతిన్నారు. రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్, తదితర వసతులు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. కేవలం ఈ ఐదేళ్లలో రంగులువేసి మాయచేశారని ఆగ్రహం చెందుతున్నారు.

(ఆమదాలవలస)

మునిసిపాలిటీలోని ఒకటో వార్డు జగ్గుశాస్త్రులపేట వద్ద టిడ్కో పేదల గృహ సముదాయాలకు ఐదేళ్లలో రంగులు మాత్రమే వేశారు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.43.32 కోట్లతో టిడ్కో సంస్థ ద్వారా పేదల గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అప్పటి ప్రభుత్వ విప్ కూన రవికుమార్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్ శంకుస్థాపన చేశారు. మునిసిపాలిటీ పరిధిలో ఉన్న 528 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపికచేశారు. ఈ మేరకు 12 బ్లాకులుగా గృహ నిర్మాణాలు ప్రారంభించారు. 2017 నుంచి 2019 వరకు శరవేగంగా 80 శాతం పనులు పూర్తిచేశారు. తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక్కడి ఎమ్మెల్యే, స్పీకర్ తమ్మినేని సీతారాం ఐదేళ్లలో టిడ్కో ఇళ్లపై ఎటువంటి శ్రద్ధ చూపకపోవడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.


టిడ్కో ఇళ్ల లోపల పరిస్థితి ఇది

హడావుడిగా స్పీకర్ ప్రారంభం

లబ్ధిదారుల నుంచి కొన్ని గృహాలకు రూ.లక్ష చొప్పున, మరికొన్ని గృహాలకు రూ.5 వేల చొప్పున అధికారులు డిపాజిట్లు సేకరించారు. మిగిలిన మొత్తం బ్యాంకు రుణాల ద్వారా సేకరించి పనులు చేపట్టాలని భావించారు. తర్వాత గృహ లబ్ధిదారుల నుంచి ప్రతి నెలా చెల్లింపులు చేపట్టడానికి చర్యలు తీసుకున్నారు. భాగస్వామి నిధులు, బ్యాంకు రుణాలు, గత ప్రభుత్వం మంజూరు చేసిన టిడ్కో నిధుల ఆర్థిక సాయంతో నిర్మాణాలు పూర్తిచేసి రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్ వసతులు కల్పించి ఈ గృహాలు ప్రారంభిస్తామని వైసీపీ పాలకులు నమ్మబలికారు. ఇంతలో అధికా రులు శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండడంతో హడావుడిగా ఒక బ్లాకులో ఉన్న 48 గృహాలను అంతంత మాత్రంగా పనులు పూర్తి చేసి ఇటీవల స్పీకర్ తమ్మినేని సీతారాంతో ప్రారంభోత్సవం చేయించారు.



స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించిన టిడ్కో శిలాఫలకం, భవనానికి రంగులేసిన దృశ్యం


వసతుల లేమి

ప్రస్తుతం టిడ్కో ఇళ్ల ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి పనులు, మౌలిక వసతులు చేపట్టలేదు. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి చొరవ చూపకపోవడంతో ప్రారంభించిన బ్లాకులో కూడా లబ్ధిదారులు ఎవరూ నివాసం ఉండడం లేదు. ఈ ఇళ్ల ప్రారంభం సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. నెల రోజుల్లో 528 మంది లబ్ధిదారులు అన్నీ వసతులతో కూడిన గృహాల్లో నివాసం ఉండడమే తన లక్ష్యమని హామీఇచ్చారు. అయితే, ఇక్కడ 48 టిడ్కో ఇళ్ల ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా, ఎన్నికల సమీపిస్తున్నా స్పీకర్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. 2017లో మంజూరు చేసి శంకుస్థాపన చేసిన టీడీపీ ప్రభుత్వమే మళ్లీ 2024లో అధికారంలోకి వచ్చి పూర్తిస్థాయి అభివృద్ధి చేసిన అనంతరం తమకు అందజేస్తుందని పలువురు లబ్ధిదారులు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధులు.. దివ్యాంగులకు హోమ్ ఓటింగ్

- జిల్లాలో 32,936 మంది
- మే 5 నుంచి 9 వరకు

హోం ఓటింగ్



శ్రీకాకుళం అర్బన్ /గార : ఈసారి వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్ సదుపాయం కల్పించింది. అందుకు సం బంధించి జిల్లా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు రకాల కేటగిరీల వారికి పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. కొవిడ్ బారిన పడిన వారు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు... 40 శాతం పైబడి వైకల్యం ఉన్నవారు... 33 రకాల అత్యవసర విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తారు. వీరిలో వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తారు. జిల్లాలో హోం ఓటింగ్‌కు అర్హత ఉన్నవారిని బీఎల్వోలు గుర్తిస్తున్నారు. హోం ఓటింగ్ కావలసిన వారు ఫారం 12(డి) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తులను పరిశీలించి తుది జాబితా తయారు చేస్తారు. నామినేషన్లు ముగిసిన తరువాత.. బ్యాలెట్ పేపర్లు ముద్రించిన తరువాత వీరికి మే నెల 5 నుంచి తొమ్మిదో తేదీ వరకూ హోం ఓటింగ్ నిర్వహిస్తారు. జిల్లాలో సుమారు 11,455 మంది 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న 21,481 మంది దివ్యాంగులు ఉన్నారు. హోం ఓటింగ్‌కు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య అవకాశాన్ని కల్పిస్తారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, వీడియోగ్రాఫర్లు, మైక్రో అబ్జర్వర్‌తో పాటు బీఎల్‌వోలు, పార్టీల ఏజెంట్లు కూడా దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి... ఓటు తీసుకుంటారు. బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగే ఈ విధానంలో కూడా దరఖాస్తుదారుని ఇంట్లో ప్రత్యేకంగా కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసి... ఏకాంతంగా ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. అవసరమైన పక్షంలో కుటుంబ సభ్యులను మాత్రమే వారికి సహకారం అందించేందుకు అనుమతిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తారు. హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసిన వారికి పోలింగ్ బూత్‌లో ఓటు వేసే అవకాశం ఉండదు.

శతశాతం ఓటింగే లక్ష్యం

జిల్లాలో శతశాతం పోలింగే లక్ష్యంగా అందరికీ ఓటు హక్కు వినియోగించుకునేందుకు చర్యలు తీసుకున్నాం. దీని లో భాగంగా జిల్లాలో 85 ఏళ్లు దాటిన కొత్త ఓటర్లను ఇప్పటికే గుర్తించాం. వారందరు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు సర్వం సిద్ధం చేశాం. అలాగే దివ్యాంగులు కూడా ఓటు వినియోగించుకునే ఏర్పాట్లు చేశాం. వీరందరూ ఆర్వోల ద్వారా ఓటు వేసే సదుపాయం కల్పించాం.

నోడల్ ఆఫీసర్ కవిత

ఎడమ చేయి చూపుడు వేలు లేకపోతే.. సిరా చుక్క దేనికి పెడతారు?



నరసన్నపేట: ఓటుహక్కు ఉన్న ప్రతి ఓటరుకు ఓటు వేసే ముందు ఎడమ చేయి చూపుడు వేలికి సిరా చుక్క గుర్తుగా పెడతారు. ఓటరుకు ఎడమ చేతి చూపుడు వేలు లేకపోతే మరి ఏ వేలికి సిరా గుర్తుపెట్టాలన్న ప్రశ్న తలెత్తొచ్చు. ఎన్నికల సంఘం దీనికి ప్రత్యామ్నాయం చూపించింది. ఎడమ చేతిచూపుడు వేలు లేకపోతే మధ్యలోని వేలికి, అదిలేకపోతే బొటన వేలికి సిరాచుక్క పెట్టే అవకాశం కల్పించింది. అసలు ఎడమ చేతికి వేళ్లే లేకపోతే కుడిచేయి చూపుడు వేలికి, అది లేకుంటే మధ్యవేలికి ఆ తర్వాత ఉంగరం వేలికి, చిటికన వేలు చివరికి కుడి చేయి బొటన వేలికి చుక్క పెడతారు. ఒక వేళ ఎడమ, కుడి చేతులకు వేళ్లు లేని పక్షంలో వేళ్ల మొదలు మధ్య భాగంలో లేదా ఇంకా చేయిపై భాగంలో సిరా చుక్క గుర్తు పెట్టే వెసులు బాటును ఎన్నికల సంఘం కల్పించింది.

అచ్చెన్నకు నీరాజనం

- నామినేషన్ సందర్భంగా టెక్కలిలో భారీ ర్యాలీ
- తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు


టెక్కలిలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

అభివాదం చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు నామినేషన్ సందర్భంగా టెక్కలిలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. నామినేషన్‌కు బయలుదేరే ముందు అచ్చెన్నాయుడుకు తన భార్య విజయమాధవి ఎదురువచ్చారు. నిమ్మాడలో తండ్రి దాలినాయుడు, తల్లి కళావతమ్మల చిత్రపటాలకు దండం పెట్టారు అచ్చెన్న. ఆ తరువాత అన్న కింజరాపు హరివరప్రసాద్ ఆశీర్వాదం తీసుకున్నారు. తమ ఇంటి కులదైవానికి మొక్కిన తరువాత కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లిని దర్శించుకుని ఎంపీ రామ్మోహన్‌నాయుడుతో కలిసి ర్యాలీగా టెక్కలి బయలుదేరారు. నాలుగు మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు తరలివచ్చి ఆయనకు నీరాజనం పలికారు. దారి పొడుగునా ప్రజలు పూలవర్షం కురిపించారు. జగతిమెట్ట జంక్షన్ మొదలుకొని వెంకటేశ్వర కాలనీ, పాతజాతీయ రహదారి, టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్, ఇందిరాగాంధీ కూడలి, జడ్పీ రోడ్డు, అంబేడ్కర్ జంక్షన్ జనసంద్రమయ్యాయి. పలువురు కార్యకర్తలు క్రేన్లతో పూలదండలను ఎంపీ రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుకు వేశారు. డప్పువాయిద్యాలు, ధూంధ డకా, తప్పెటగుళ్ల హడావుడి, యువతుల నృత్యాలతో సందడి నెలకొంది. ఈ నామినేషన్ కార్యక్రమంలో చంద్రబాబునాయుడు డూప్‌గా నందిగాం మండలానికి చెందిన తిరున గిరి కృష్ణ చేతులు ఊపుతూ ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కణితి కిరణ్‌కుమార్, టీడీపీ నాయకులు బగాది శేషగిరి, బోయిన రమేష్, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు, తర్ర రామకృష్ణ, కింజరాపు హరిప్రసాద్, వెలమల కామేశ్వరరావు, బీజేపీ నాయకులు బూరె నరేంద్ర, ధూపాన రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారపర్వం

కూటమి విజయం తథ్యం: శంకర్


ప్రచారం నిర్వహిస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్

అరసవల్లి/శ్రీకాకుళం రూరల్: వైసీపీ ఎన్ని కుట్రలు చేసిన రానున్న ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. సోమవారం నగరంలోని కొన్నావీధి, తుమ్మావీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం చాపురం, గోవిందపురం గ్రామాలకు చెందిన 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే చిట్టివానిపేట గ్రామానికి చెందిన 300 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి గొండు శంకర్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సైకిల్ గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమా ల్లో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, జనసేన నియోజకవర్గ కన్వీనర్ కోరాడ సర్వేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, అల్లు రమేష్, జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి.. కూటమి విజయం తథ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి గొండు శంకర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు.

50 వేల మెజార్టీతో గెలవబోతున్నా: అచ్చెన్న

టెక్కలి: వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు టెక్కలిలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కొందరు కలెక్షన్ల దందా చేశారని, ఎవరి పుట్టిన రోజులు వచ్చినా వైశ్య కులస్థుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం కోపరేటివ్ బ్యాంక్ సమీపంలో ఎన్నికల ప్రచార వాహనంపై నుంచి మాట్లాడారు. తన మీద పోటీచేస్తున్న వైసీపీ వ్యక్తికి విలు వలు, గౌరవం లేదని, అటువంటి వ్యక్తిపై ఈ ఎన్నికల్లో నేను 50వేల మెజార్టీతో గెలుస్తానని తెలిపారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు కార్యకర్తల్ని బెదిరించడం, కేసులు పెట్టడం వారి పనైందని, అంతేకాకుండా దాచుకోవడం, దోచుకోవడంతో ఐదేళ్లు కాలయాపన చేశారన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం: ఎన్ఈఆర్


మాట్లాడుతున్న ఎన్ఈఆర్

రణస్థలం: యువతకు ఉపాధి కల్పనే ధ్యేయమని ఎచ్చెర్ల నియోజక వర్గం బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. సోమవారం రావాడ, ఉప్పువలస, తెప్పలవలస, నెలవాడ, పతివాడపాలేం గ్రామాల్లో ఆత్మీయ కలయిక కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు సతీమణి ప్రభనాయుడు, లెంక శ్యామలరావు, లెంక ప్రభ, లెంక అప్పలనాయుడు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి: శిరీష


దున్నూరులో ప్రచారం చేపడుతున్న గౌతు శిరీష

హరిపురం: పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషా మందస మండలం దున్నూరు, గెద్దూరు, చిన్నదున్నూరు, పితాళిలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి ఒక్క టీడీపీతోనే సాధ్యమన్నారు. వైసీపీ కల్లబొల్లి మాట లు చెప్పి పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, తాతారావు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పలాసలో 15 కుటుంబాలు..

పలాస/వజ్రపుకొత్తూరు: పలాస టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి సమక్షంలో వజ్రపుకొత్తూరు మండలం గర్తంవానిపేటకు చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరిన వారిలో గర్తం భారతమ్మ, తులసమ్మ, సుశీల, సుందరమ్మ, వరలక్ష్మి, శాంతమ్మ, మల్లేసు, గంగాధర్ ఉన్నారు.

టీడీపీలో చేరిన 30 వైసీపీ కుటుంబాలు


టీడీపీలో చేరినవారితో కూన రవికుమార్

పొందూరు: పొందూరు కాటిచెరువు కాలనీకి చెందిన 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. సోమవారం కాలనీకి చెందిన అనకాపల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారికి టీడీపీ అభ్యర్థి రవికుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, ఎ.చినరంగ, నేతలు కె.శ్రీనివాసరావు, మురళి, వైకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తంపర సమస్యకు పరిష్కారం చూపుతాం: ఎంపీ


మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

పోలాకి: తంపర రైతులు ఎదుర్కొం టున్న వరద ముంపు సమస్యకు శాశ్వ త పరిష్కారం చూపుతామని శ్రీకాకు ళం ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మో హన్‌నాయుడు తెలిపారు. తమ ప్రభు త్వం హయాంలో రూ12కోట్లు విస్తరణ పనులకు మంజూరు చేసినా వైసీపీ నాయకులు చేపట్టలేకపో యారని ఆరోపించారు. సోమవారం గుప్పెడుపేటలో నరసన్నపేట ఉమ్మడి టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూ ర్తితో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్ర మంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ డోల జగన్, బైరి భాస్కరరావు, టీడీపీ మండలాధ్యక్షులు మిరియబిల్లి వెంకటఅప్పలనాయుడు, రేణంకికృష్ణంనా యుడు, అర్జాల విష్ణు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ యువతి మృతి


తోయజాక్షి(ఫైల్)

హరిపురం: మందస మండలానికి చెందిన యువతి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. తల్లిదండ్రులు, బంధువుల కథనం మేరకు.. మందస మండలం లోని మఖరజోలకి చెందిన తోయజాక్షి వలంటీరుగా పనిచేస్తోంది. సువర్ణపురం పంచాయతీ ఉగ్రవాణి పేటకు చెందిన డొక్కరి కిరణ్‌తో పరిచయమై ప్రేమగా మారింది. అప్పటికే ఆ యువ తికి వివాహం నిశ్చయమైంది. కిరణ్ మాయమాటలు నమ్మి పెళ్లి జరిగిన మూడు రోజులకే విడాకులు తీసుకుంది. అనంతరం వలంటీరు ఉద్యోగాన్ని వదిలి హైదరాబాద్‌లోని పటాన్ చెరువులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ రూం తీసుకుని ఒంటరిగా ఉంటోంది. కిరణ్ బెంగళూరులో సీఏ విధులు నిర్వహిస్తూ హైదరాబాద్ వస్తుండేవాడు. ఈ క్రమంలో ఏడాది గడిచిపోయింది. వివాహం చేసుకుంటానని నమ్మిస్తూ తన తమ్ముడికి వివాహమని చెప్పి కిరణ్ స్వగ్రామానికి పదిరోజుల కిందట చేరుకున్నాడు. ఆదివారం కిరణ్ వివాహం గురించి తెలుసు కున్న యువతి ఫోన్ చేసింది. నీవులేని జీవితం నాకువద్దు.. నిన్ను నమ్మి నాజీవితం పాడు చేసు కున్నాను.. ఇవే నా చివరి మాటలు అంటూ.. పటాన్ చెరువులోని ఓ పార్కులో శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కిరణ్ యువ తి పనిచేస్తున్న కంపెనీ యజమానికి ఫోన్ చేసి తెలియజేయగా తన సిబ్బందితో కలిసి పార్కులో పడి ఉన్న యువతిని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. తల్లి ఫిర్యాదు మేరకు పటాన్‌చెరువు పోలీసులు 306, 420సెక్షన్ల కింద డొక్కరి కిరణ్‌పై కేసు నమోదు చేశారు.

శ్లాబ్‌పై నుంచి జారిపడి ఒకరి మృతి

హరిపురం: మందస మండలంలోని బైరిసారంగపురంలో ఇంటిపై నిద్రిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు శ్లాబ్‌పై నుంచి జారిపడి ఆర్ఎంపీ వైద్యుడు బొడ్డు చంద్రశేఖరం(50) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... పాతపట్నం మండలం కాగువాడకు చెందిన చంద్ర శేఖరం ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. మందస మండలం బైరిసారంగపురంలో ప్రస్తుతం నివసిస్తున్నాడు. అయితే రాత్రి శ్లాబ్‌పై పడుకోగా నిద్రమత్తులో ఇంటి పక్కన ఖాళీ స్థలంలో ముళ్ల పొదల్లో జారి పడడంతో తలకు పూల కుండీ తగిలి తీవ్ర రక్తస్రావమైంది. భార్య ఎనిమిదేళ్ల కిందటే మృతి చెందడంతో ఒక్కడే నివాసముంటున్నాడు. దీంతో నాలుగు రోజులుగా కనిపించకపోవడంతో క్యాంపునకు వెళ్లారని స్థానికులు భావించారు. సోమవారం ఉదయం దుర్వాసన రావడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్ఐ అనీల్‌కుమార్ పరిశీలించి కేసునమోదు చేశారు.

ఆస్పత్రికి తరలిస్తుండగా యువకుడు..

హిరమండలం: హిరమండలం రెల్లివీధికి చెందిన పూల వ్యాపారి పందిరి కళింగపట్నం ధనుంజయరావును (26) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడని ఎస్ఐ నారాయణ స్వామి చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు.. ధనుంజయరావు కొద్దిరోజుల కిందట ఇదే గ్రామానికి చెందిన పందిరి రాజా వద్ద రూ.5వేలు అప్పు తీసుకున్నాడు. ఇందులో కొంత మొత్తం అప్పు తీర్చాడు. మిగిలిన సొమ్ము ఇవ్వాలని రాజా స్నేహితుడు పందిరి మిన్నారావుతో కలిసి పలుపార్లు వేధింపులకు పాల్పడ్డాడు. దాడికి కూడా దిగడంతో ఇంతలో సాగు చేస్తున్న పూలతోట వద్ద ఈనెల 11న ధనుంజయరావు పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను స్థానిక పీహెచ్‌సీకి తర్వాత శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అయితే సీతాపురంలో నివాసముంటున్న ధనుంజయరావు సోదరి కొనఊపిరితో ఉండడంతో, ఆమెను చూపించేందుకు వాహనంలో తీసుకువెళ్లారు. అక్కడ ధనుంజయరావు ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో సోమవారం వేకువజామున ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. తండ్రి భూలోకం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బావిలో పడి వృద్ధుడి ఆత్మహత్య

నరసన్నపేట: స్థానిక లచ్చుమన్నపేటకు చెందిన రేసు లక్ష్మణరావు (65) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ అశోక్‌బాబు సోమవారం తెలిపారు. మూడురోజుల కిందట అమ్మవారితల్లి ఆలయ ప్రాంగణంలోగల బావిలో లక్ష్మణరావు దూకినట్లు చెప్పారు. ఈ మేరకు సోమవారం స్థానికులు బావిలో మృతదేహాన్ని చూసి సమాచారం ఇచ్చారని తెలిపారు. స్థానికులు సాయంతో బయటకు తీసి మృతదేహానికి శవపంచనామా నిర్వహించినట్లు చెప్పారు. లక్ష్మణరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

టెక్కలి: పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న రైలు నుంచి ఆదివారం రాత్రి 9గంటల సమయంలో రౌతుపురం, నౌపడా రైల్వేస్టేషన్ మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి జారిపడడంతో బలమైన గాయాలయ్యాయి. అయితే స్థానికులు క్షతగాత్రుడ్ని 108 అంబులెన్స్ ద్వారా టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి కి తరలించినప్పటికే మృతిచెందాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి యువకుడికి గాయాలు

పలాసరూరల్: మండలంలోని కిష్టుపురం సమీపంలో సోమవారం యశ్వంత్‌పూర్ సూపర్ ఫాస్ట్ రైలు నుంచి కోల్‌కత్తాకు చెందిన షైరుద్దిన్ దాలి జారిపడ్డాడు. గమనించిన కిష్టుపురం యువకులు స్పందించి గ్లో సంస్థ అంబులెన్స్ ద్వారా పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పలాస జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు.

‘పది’ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు

● శతశాతంతో పాటు మంచి మార్కులు..

(ఆంధ్రజ్యోతి బృందం)


మందస: భాగ్యశ్రీని అభినందిస్తున్న ఎంఈవో హెచ్‌ఎం

జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వం పరిధిలోని పలు విభాగాల పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు సత్తా చాటారు. పలు పాఠశాలలు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో శతశాతం ఫలితాలు వస్తే మరి కొన్ని పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. మందస జడ్పీ హైస్కూల్ విద్యార్థిని భాగ్యశ్రీ పండిట్ 596 మార్కులతో ఎంఈవో ఎం.లక్ష్మణరావు తెలిపారు. మండలంలో 92శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఎచ్చెర్ల మండలం అల్లినగరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ముని మణికంఠ 594 మార్కులు సాధించాడు. పలాస హైస్కూల్‌లో మేఘన మహరణ 592 మార్కులు సాధించినట్లు ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. మెళియా పుట్టి మండలంలో కోనమాళ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మామిడి సోనియా 592, బోయినా లాస్య 587, బోచ్చు క్రాంతి కిరణ్ 583 మార్కులు సాధించినట్లు ఎంఈవో పద్మనాభం తెలిపారు. కంచిలి మండలం మోడల్ స్కూల్, పెద్దకొజ్జిరి, జేఎల్ కోట జడ్పీ పాఠశాలల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో శివరాం ప్రసాద్ తెలిపారు. ముండల జడ్పీ పాఠశాలకు చెందిన శ్రీను పాత్రో 589, మార్కులు, జెఎల్ కోట పాఠశాలకు చెందిన మురళీ గౌడ 586, డీజీ పురం పాఠశాల విద్యార్థి గన్ని నిర్మల 582 మార్కులు సాధించారని చెప్పారు. వజ్రపు కొత్తూరు మండలం అక్కుపల్లి ఎంజేపీ మత్స్యకార బీసీ గురుకులం విద్యా ర్థులు 57 మందికి శతశాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈవో దశరథ తెలిపారు. కవిటి మండలంలో జడ్పీ ఒరియా, సహలాలపుట్టుగ, ఏపీ మోడల్ స్కూల్, రాజపురం, డీజీ పుట్టుగ, కొత్త కొజ్జిరియా పాఠశాలలు శతశాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈవో ధనుంజయ్ మజ్జి తెలిపారు. సహ లాలపుట్టుగ పాఠశాల విద్యార్థిని ఈర రేష్మ 582, బొరివంక పాఠశాల విద్యార్థిని సిలగాపు సౌమ్యశ్రీ 581 మార్కులు సాధిం చారన్నారు. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం జడ్పీహెచ్ఎస్, ఇచ్ఛాపురం కేజీబీవీ విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించారని ఎంఈవో కె.అప్పారావు తెలిపారు.

ఇచ్ఛాపురం ఎంపీఎల్ జీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని కె. మహిద 586, రత్తకన్న ఎంహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పవన్ బిసాయి 586 మార్కులు సాధించారని చెప్పారు. గార మండలం, శాలిహుండం కేజీబీవీ పాఠశాలలో బాలికలు శతశాతం ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎస్.లలిత కుమారి తెలిపారు. 38 మంది పరీ క్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. వమరవల్లిలో ఏపీ గురుకుల పాఠశాలలో శతశాతం ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వై.చిట్టితల్లి తెలిపారు. వాన ధనలక్ష్మి 590, చౌదరి శ్రావణి 586, వెలమల యామిని 585, విక్రమ్ గాయత్రి 583, మట్ట సాయినీదేవి 581 మార్కు లు సాధించినట్లు పేర్కొన్నారు. నరసన్నపేట మండలం లో మడపాం, మాకివలస, ఉర్లాం, లుకలాం, బాడాం పాఠశాలతో పాటు ఎంజేపీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్నత సాధించారని ఎంఈవోలు పి.దాలినాయుడు, ఉప్పాడ శాంతారావు తెలిపారు. ఎంజేపీ ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ ఢిల్లీశ్వరరావు 589, నరసన్నపేట బోర్డు పాఠశాల విద్యార్థిని పి.మేర్సి 585 మార్కులు సాధించారన్నారు. హిరమండలం కేజీబీవీ పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో కృష్ణవేణి తెలిపారు. విశ్రావ్య 583 మార్కులు సాధించిం దన్నారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.ఉదయ్‌కిరణ్ 584, బి.మణి 583 మార్కులు సాధించారని హెచ్‌ఎం కేశవరావు తెలిపారు. సోంపేట మండలం కర్తలిపాలెం, పొత్రఖండ జిల్లాపరిషత్ హైస్కూల్, ఎంజీ పురం ఆశ్రమ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ పాఠశాల విద్యార్థిని శ్రీశ్రావ్య అమృతకు 591, ఎస్.దివ్యశ్రీకి 590 మార్కులు సాధించినట్లు ఎంఈవోలు తెలిపారు. ఎల్ఎన్‌పేట మండలం ఎల్ఎన్ పేట జడ్పీ హైస్కూల్ విద్యార్థి కె.రాహుల్ 588, కొమ్మువలస జడ్పీ పాఠశాల విద్యార్థిని వై.ప్రశాంతి 583 మార్కులు సాధించినట్లు ఎంఈఓ-2 కె.చంద్రమౌళి తెలిపారు. మండల వ్యాప్తంగా 95.42 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు.

శ్రీకాకుళం రూరల్ రూరల్ మండలం పెద్దపాడు సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయంలో 80 మంది పరీక్షలు రాయగా 79 మంది ఉత్తీర్ణులై 98.7 శాతం ఫలితాలను సాధించారని ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి తెలిపారు. ఎ.దీపిక 582, ప్రవల్లిక 581 మార్కులు సాధించారన్నారు. నందిగాం మండలం కస్తూరిబా బాలికల విద్యాలయం, జయపురం గిరిజన ఆశ్రమ పాఠశాల, దిమ్మిడిజోల, నర్సిపురం, కవిటిఅగ్రహారం, రౌతుపురం ఉన్నత పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత పొందారని ఎంఈవో నర్సింహులు తెలిపారు. మండలంలో 95.2 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. టెక్కలి మండలంలో లింగాలవలస, రావివలస, భీంపురం, తలగాం, టెక్కలి బీసీ బాలికల గురుకులం, జడ్పీ బాలికోన్నత పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు తులసీరావు, చిన్నవాడు తెలిపారు. మహాత్మాగాంధీ బీసీ బాలికల గురుకులం నుంచి ఎస్.స్నేహిత 589, నర్సింగపల్లి నుంచి వి.ఖగేశ్వరి 588, మహాత్మాగాంధీ జ్యోతిబాఫూలే పాఠశాల నుంచి ఎస్.మానస 588, సీతాపురం నుంచి ఎస్.విశాల్ 587 మార్కులు సాధించారన్నారు.

ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురం ఏపీ గురుకుల పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించగా గుజ్జు శ్రీహర్ష 591 మార్కులు సాధించాడు. పొన్నాడ కేజీబీ వీలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. బొంతలకోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 69 మందికి గాను 68 మంది ఉత్తీర్ణులు సాధించారు. దుప్పలవలస గురుకులంలో 75 మందికి 74 మంది ఉత్తీర్ణులు కాగా టీవీఎం సాయిరాం 585 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాళ్లు తెలిపారు. మండలంలో ఏడు ఉన్నత పాఠశాలల్లో శతశాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ శ్రీనివాస నాయక్ తెలిపారు. ఈదులవలస ఆదర్శ పాఠశాలలో 96 మందికి శతశాతం ఉత్తీర్ణత సాధించగా వీరిలో దేశుల్ల ఉమా 584, మెట్ట జీవిత 584 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. పోలాకి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 89 మందికి 88 మంది ఉత్తీర్ణుల య్యారని, వీరిలో కోరాడ అక్షయ 588, బి.పూజిత 582 మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం ఆర్.లక్ష్మి తెలిపారు. గంగివలస కేజీబీవీ బాలికల పాఠశాలలో 43 మంది హాజరుకాగా శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో జి.శారద తెలిపారు. పొందూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. తోలాపి జడ్పీ ఉన్నత పాఠశాలలో 100 శాతం ఫలితాలు సాధించారు. బొమ్మన కుసుమ 586 మార్కులు సాధించింది. కింతలి జడ్పీ పాఠశాలలో 98.5 శాతం ఫలితాలు రాగా కూన నాగలక్ష్మి 590, జి. గుణశేఖర్ 585, పైడి సుష్మ, కిల్లాన జ్యోతిక 583 మార్కులు సాధించారు. వావిలపల్లి మోడల్ పాఠశాలలో 100 శాతం ఫలితాలు సాధించగా ఆనెం పవిత్ర 590 మార్కులు సాధించారు. తాడివలస 100 శాతం ఫలితాలు సాధించారు. కేజీబీవి పాఠశాల నుంచి 95 శాతం ఫలి తాలు సాధించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు 95 శాతంపైగా ఫలితాలు సాధించారు. కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి టి.నాగసాయి పూజిత్ 585, ఆర్.సుశ్మిత, ఎ.సుశాంత్ 584 మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం చిన్నం నాయుడు తెలిపారు. రణస్థలం ఏపీ మోడల్ స్కూల్‌లో శతశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో కె.శిరీష 591, వి.కిరణ్ 589, ఎస్.సహీన్ 588, పీ.తనూష 588 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ తెలిపారు. జలుమూరు మండలంలో అల్లాడ, లింగాలపాడు, పెద్దదూగాం ఉన్నత పాఠశాలలు, కరవంజ మోడల్ స్కూల్, జలుమూరు కేజీబీవీల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. కరవంజ మోడల్ స్కూలు విద్యార్థినులు గుంటముక్కల దీపిక, తమ్మినేని తేజస్విని 585, చింతు సంధ్యన 584 మార్కులు సాధించారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు. బూర్జ మండలం ఓవీపేట ఆదర్శ పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు తెలిపారు. చింతాడ అనన్య శ్రీ, డి.పవిత్ర 581 మార్కులు సాధించారన్నారు.


591 మార్కులు సాధించిన శ్రీహర్ష, శ్రీశ్రావ్య, శిరీష

శ్రీసాయి విద్యామందిర్ విద్యార్థుల ప్రతిభ


రుషిత ప్రేరిత

గుజరాతీపేట: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పీఎన్ కాలనీలోని శ్రీసాయి విద్యామందిర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ బి.లక్ష్మణరావు, హెడ్ మిస్ట్రెస్ ఎస్.లక్ష్మి తెలిపారు. వీరిలో వి.రుషిత 594, ఆర్.ప్రేరిత 585, కె.కపిల్ 577 మార్కులు సాధించారన్నారు. మొత్తం విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, హెడ్‌మి స్ట్రెస్‌తో పాటు రిటైర్డ్ హెడ్మాస్టర్ పైడి పాండురంగారావు, అకడమిక్ ఇన్‌చార్జి కోటేశ్వరరావు తదితరులు అభినందించారు.

శారదా విద్యానికేతన్‌లో శతశాతం ఉత్తీర్ణత

గుజరాతీపేట: శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం శారదా విద్యానికేతన్ పాఠశా లలో పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ ముద్దాడ రామ్మోహన్ తెలిపారు. వై.అక్షయ 590 మార్కులు సాధించినట్లు తెలిపారు. 80 మంది విద్యార్థుల్లో 500 మార్కులకు ఎక్కువే 61 మంది సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

నేడు కృష్ణాపురంలో చంద్రబాబు ప్రజాగళం

ఆమదాలవలస: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మంగళవారం పట్టణంలోని కృష్ణాపురం జంక్షన్‌లో ప్రజాగళంలో పాల్గొంటారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు తిమ్మాపురం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ హెలికాప్టర్‌లో చేరుకొని పార్వతీశునిపేట మీదుగా రోడ్‌షోతో కృష్ణాపురం జంక్షన్‌కు చేరుకుంటారన్నారు. మండలాలు, మున్సిపాలిటీకి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

చంద్రబాబు రాక నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

పాతపట్నం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాతపట్నం పర్యటన సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తు న్నట్లు ఎస్ఐ మహమ్మద్ యాశిన్ తెలిపారు. శ్రీకాకుళం నుంచి పర్లాకిమిడి వెళ్లే వాహనాలు సీది వద్ద నుంచి ఏఎస్‌కవిటి తదితర గ్రామాల మీదుగా పర్లాకిమిడి చేరుకోవాలన్నారు. పట్టణంలోని జూబిలీరోడ్ నుంచి బ్రాహ్మణ వీధి గుండా ప్రధాన రహదారికి చేరవచ్చన్నారు. పర్లాకిమిడి నుంచి శ్రీకాకుళం వెళ్లే వాహనాలు స్థానిక అంతరాబరోడ్ వద్ద మలుపు తిరిగి దశరథపురం మీదుగా మోడల్ డిగ్రీ కళాశాల, వేంకటేశ్వర ఆలయం వద్ద ప్రధాన రహదారికి చేరవచ్చన్నారు. వాహనదారులు ఈ ట్రాఫిక్ ఆంక్షలను పాటించాలని ఆయన కోరారు.

పీజీ, ఎల్ఎల్‌బీ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల పీజీ నాలుగు, ఎల్ఎల్‌బీ (మూడు,ఐదేళ్ల) మొద టి సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభ మయ్యాయి. వర్సిటీ కేంద్రంగా ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగు తున్నాయి. వర్సిటీ రెక్టార్, పరీక్షల చీఫ్ (అర్స్) ప్రొఫెసర్ బి.అడ్డ య్య పరీక్షల నిర్వహణ తీరు ను పరిశీలించారు. తొలి రోజు ఆర్స్, లా కోర్సులకు 383 మంది, సైన్స్ కోర్సులకు 314 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా, వర్సిటీలో మధ్యాహ్నం నిర్వహిం చిన పీజీ డిప్లమో ఇన్ యోగా రెండో సెమిస్టర్ పరీక్షలకు 15 మంది హాజరయ్యారు. పరీక్షల చీఫ్ డాక్టర్ కె.స్వప్నవాహిని పర్యవేక్షించారు. పరీక్షలు 30 వరకు జరగనున్నాయి.

ఆదిత్యునికి సింహ వాహనంపై తిరువీధి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో సింహ వాహనంపై తిరువీధి మహోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉద్యాన వనంలో తిరుమంగయాళ్వారుల చరిత్ర విన్నపాన్ని పండితులు చేప ట్టారు. కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్, పలువురు పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నియమావళిని అతిక్రమిస్తే చర్యలు: ఆర్వో

టెక్కలి: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని టెక్కలి నియోజకవర్గ ఎన్ని కల రిటర్నింగ్ అధికారి నూరుల్‌కమర్ హెచ్చరించారు. సోమవారం సుభద్రాపురంలో కేంద్ర బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ సీహెచ్ రాజా, టెక్కలి సీఐ సూర్యచంద్ర మౌళి, నందిగాం ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ, ఎంపీడీవో జి.శివప్రసాద్, ఆర్ఐ పి.కిరణ్ పాల్గొన్నారు. ● **గార:** శ్రీకూర్మం, అంపోలులో పోలింగ్ కేంద్రాలను సోమవారం ఏఎస్పీ ప్రేమ్‌కాజల్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్.ఐ. కె.కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌కు ఇద్దరు ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్: కేశవరావుపేటకు చెందిన పైడి శివరామకృష్ణ, ఇప్పిలికి చెందిన కె.మాధురి ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు బెంగళూరులో జరగనున్న సౌత్ జోన్ జూనియర్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, కార్యదర్శి సిగిలిపెల్లి లక్ష్మీదేవి తెలిపారు. అనంతపురంలో జరగనున్న కోచింగ్ క్యాంపులో హాజరై అక్కడ నుంచి జాతీయ పోటీలకు వెళతారన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం

పలాసరూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని సీపీఐఎంఎల్-లిబరేషన్ తెలిపారు. సోమవారం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు.

తగ్గిన విద్యుత్ బిల్లు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కవిటి: మండలంలోని కుసుం పురానికి చెందిన డి.వాసుదేవ్‌కు ఊరట లభించింది. ఇంటి కరెంటు బిల్లును అధికారులు సరిచేశారు. ఆరు యూనిట్లకు రూ.2211లు బిల్లురావడంలో వాసు దేవ్ ఆందోళనకు గురయ్యాడు. ఈవిషయాన్ని ఈనెల 12న విద్యుత్ బిల్లు.. గుబులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ అధికారులు స్పందించి ఇంటిని పరిశీలించి షార్టు పాల్ కింద రూ.2133లతో కలిపి రూ.2213 వచ్చిన బిల్లును సరి చేశారు. కేవలం రూ.317 కడితే సరిపోతుందని బిల్లును అందజేయడంతో ఊపిరి పీల్చుకున్నాడు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

సంతబొమ్మాళి: ఉమిలాడలో అసిరితల్లి గ్రామ దేవత ఉత్సవాలు పురస్కరిం చుకుని మంగళవారం నుంచి ఉత్తరాంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులు 8919514974, 8374218780 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ధరిత్రీ దినోత్సవం

పలాసరూరల్: బ్రాహ్మణతర్లా జడ్పీ ఉన్నతపాఠశాలలో సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు గ్లోబ్‌ను చేపట్టి భూ సంరక్షణకై ప్రతిజ్ఞ చేశారు.

● **పొందూరు:** తాడివలస జ డ్పీ ఉన్నత పాఠశాలలో ధరిత్రి దినోత్సవం పురస్కరించుకుని భూమి ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాల్గొన్నారు.